telugubooks

# కేవలం కాగితాలకే పరిమితమైనవి...

అను

# ఓ ఆదర్శం కథ!

కాలేజీలో చదువుకునే రోజుల్లో ఎన్నోసార్లు వ్యాస రచన పోటీల్లో బహుమతులు పొందాను!

మరెన్నోసార్లు డిబేట్లలో వాదించి అందరి ప్రశంసలూ పొందాను!!

ఇంకా చెప్పాలంటే—

సీనియర్స్ దృష్టిలో ఆదర్శ విద్యార్థిని... సమకాలీనుల దృష్టిలో ఉన్నతుణ్ణి.... జూనియర్స్ దృష్టిలో హీరోని....!!!

ఇన్ని రకాలుగా నేను అభినందించబడటాని కారణం....?

నా ఆదర్శాలు, ఆశయాలు!

అందుకే కాలేజీని వదిలిపెట్టినా వాటిని వదిలిపెట్టదలచుకోలేదు.

మనుషులు డబ్బుని సంపాదించాలి. కాని డబ్బు మనుషుల్ని సంపాదించకూడదు.... అన్నిటికన్నా ముఖ్యమైనది మానవత్వం..... ప్రేమతో దేనినయినా సాధించవచ్చు.... ఇవి కేవలం కొన్ని అభిప్రాయాలు మాత్రమే!

అందుకే నేను ఉద్యోగస్థుణ్ణి అయిన తర్వాత డబ్బుకి అసలు విలువ ఇవ్వడమే మానేశాను. మిత్రులు, చుట్టాలు ఎవరితో తిరిగినా, వాళ్ళు పైసా ఖర్చుపెట్టినా నాకు ఇష్టం వుండేదికాదు. ఖర్చంతా నాదే! వాళ్ళు అభిమానాన్ని చూపిస్తేచాలు!

అందరికీ నేనంటే విపరీతమైన ప్రేమ!

ఇలా నా అభిప్రాయాలతో అందరి మెక్కినట్లు మురిసిపోతున్న నాకు కన్య ఓ పెళ్ళిలో కనిపించింది.

నా ఆశయాలకు, ఆదర్శాలకు తగ్గ మనిషిగా అనిపించింది.

అంతే! ఏ మాత్రం సందేహించకుండా ఆమె ముందు విషయాన్ని వుంచేశాను.... మీకిష్టమైతే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవడానికి మీవాళ్ళని సంప్రదిస్తానని!

కన్య కళ్ళు ఆనందంతో మెరిశాయి.

కన్య కళ్ళు ఆనందంతో మెరిశాయి.

అందం, మంచి ఉద్యోగం వున్న యువకుడు వచ్చి ఏరి, కోరి 'నిన్ను పెళ్ళిచేసుకుంటాను' అంటే ఏ ఆడపిల్ల కళ్ళు మెరవవూ?

"ఆదివారం సాయంత్రం మీ ఇంటికి వస్తాను." అప్పటి కప్పుడే అపాయింట్ మెంట్ ఇచ్చేశాను.

కన్య మరింత ఆనందపడింది.

ఆదివారం కోసం ఆమె ఎదురు చూసిందో లేదో గాని నేను మాత్రం తెగ ఎదురు చూసాను. ఆదివారం సాయంత్రం సరిగ్గా నాలుగ్గంటలకల్లా వాళ్ళ ఇంటిముందు వాలాను.

గుమ్మంలోనే ఎదురొచ్చింది కన్య.

వాళ్ళ నాన్నగారికి పరిచయం చేసింది.

ఆయన నన్ను చాలా ఆప్యాయంగా పలకరించారు. "పైన కూర్చుని మాట్లాడుకుందాం పదబాబూ!...." దారి పైకి దారితీశారు ఆయన. అనుసరించాను నేను.

కన్య అంతా ఆయనకి చెప్పేసినట్లే అనిపించింది. అందుకే ఎక్కువ ఉపోద్ఘాతం లేకుండా అసలు విషయంలోకి వచ్చేశాను.

''చాలా సంతోషం బాబూ!.... నీలాంటి యువకుల అవసరం దేశానికి ఎంతో వుంది... సినిమాలు, షికార్లు అంటూ తిప్పకుండా ఇలా సూటిగా నాతో మాట్లాడడానికి రావడమే నీ వ్యక్తిత్వం చెబుతుంది...." ఆయన కాంప్లిమెంట్ నిజంగా నన్ను అందలాన్ని ఎక్కించేసింది.

నోట మాట రావడం మానేసింది.

అందుకే ఆయనే మాట్లాడసాగారు:

"డబ్బుకి అమ్ముడు పోయే కుర్రాళ్ళంటే నాకు వళ్ళు మంట. అందుకే నాకు ఎంత డబ్బున్నా కట్నంతోమాత్రం అల్లుణ్ణి కొనగూడదనే ఆదర్శానికి కట్టుబడ్డవాణ్ణి...."

నా కాలికి బ్రేక్ వేశాడాయన. అయినా నేను కిందపడలేదు. కారణం నేనూ ఆదర్శాలు గలవాణ్ణి కావడమే!

"అవునండీ .... నాకూ ఈ కట్నాలమీద సదభిప్రాయం లేదు...." నసిగాను.

"ఆ విషయం నువ్విలా డైరెక్ట్‌గా రావడంతోనే అర్థమవుతోంది బాబూ! .... కొంతమంది కట్నాలు వద్దంటూనే లాంఛనాలు లిచదువుదిస్ట్ తారు ..."

"వాటికీ నేను విరుద్ధమండీ! ..."

"మా అమ్మాయి చాలా అదృష్టవంతురాలు బాబూ!...."

ఆనందపడిపోయాను.

"ఆడంబరంగా పెళ్ళిఖర్చులు చెయ్యడం దండగ కదూ?...."

నా నోటికి తాళం పడింది.

ఏమి మాట్లాడితే ఆయన కాళ్ళకి బంధం ఎలా వేస్తారో అనే భయంతో వూరుకుండిపోయాను. 'ఎలాంటివారు, ఎలా మారిపోయారు' అని కన్య ఎక్కడ చీత్కరించుకుంటుందోననే భయమూ నాలో లేక పోలేదు.

"పెళ్ళి పూట మాత్రం భోజనాలు ఏర్పాటు చేస్తాను .... వెంటనే మనం ఆ హాల్‌ని ఖాళీ చేస్తే అద్దె తగ్గుతుందికదా?"

ఆలోచనలో పడ్డాను.

ఇంట్లో అమ్మ, నాన్నగార్లను ఏదోవిధంగా కన్విన్స్ చేసి కట్నం లేకుండా చేయగలను. చెల్లెళ్ళని ప్రతిమాలి లాంఛనాలు నేను ఇస్తానని సర్దిచెప్పగలను. కానీ పెళ్ళి చూడాలని ఎంతో దూరం నుంచీ వచ్చే బంధువుల్ని, మిత్రుల్ని వెంటనే తిరిగి వెళ్ళిపొమ్మని ఎలా చెప్పగలను?

అదే సందేహాన్ని ఆయన ముందు వెళ్ళగక్కాను.

"చూడు బాబూ! మందికోసం ప్రాకులాడడం నాకు ఇష్టం వుండదు. నా పద్ధతులు నావి...."

ఇంతవరకూ ఎంతో ఆదర్శవంతుడినని నన్ను ఒక్కో మెట్టూ పైకి ఎక్కిస్తున్న ఈయనేనా ఇలా మాట్లాడుతున్నది?

ఆయనంత నిర్మొహమాటంగా మాట్లాడేసరికి నాకూ కోపం వచ్చింది. ఓ దణ్ణం పెట్టి లేచి వద్దామనిపించింది.

కానీ, అలా చేస్తే కన్య నన్ను ఎంత నీచంగా అనుకుంటుంది? ఈ ఆలోచన నన్ను తొందరపడనివ్వలేదు.

ఒక ఆదర్శప్రాయుడుగానే నిలబడాలన్న నా ఆశ ఏమైపోతుంది?

అందుకే ఆయన చెప్పినవాటిన్నిటికీ ఒప్పేసుకుని 'మంచి వాడు' అనే బిరుదుని తీసుకుని మరీ ఇంటికి బయల్దేరాను.

ఈ విషయాలన్నింటినీ చెప్పేసరికి ఇంట్లో బాంబులు పేలినట్లయింది అందరూ నన్నో 'విదేశీహస్తాన్ని' చూసినట్లు చూడసాగారు. ఎలాంటివాడు ఎలా మారిపోయాడు అనుకున్నారు అంతా ముక్తకంఠంతో.

"ఆల్ రైట్! సరే.... నీ ఆదర్శాల కోసంనేను పైసా కట్నం తీసుకోను సరే.... కానీ మీ చెల్లెలికి కూడా పైసా కట్నం ఇవ్వకుండా పెళ్ళి చేస్తావా?" సూటిగా అడిగారు నాన్నగారు.

"ఆ" అన్నాను.

"దేశం నీలాంటి చవటలతో నిండిలేదురా!" ఆయన కోపం పెరిగింది.

"ఒకవేళ కట్నం ఇవ్వాల్సివచ్చినా ఆ సంగతి నేను చూసుకుంటాను...."

"నా పిల్ల పెళ్ళి నేను చేసుకోలేనివాణ్ణనుకున్నావా! నీకా శ్రమ అక్కర్లేదులే. నువ్వు మాత్రం ఒకటి గుర్తుంచుకో. నన్నుకాదని ఈ పెళ్ళికి ఒప్పుకుంటున్నావు కాబట్టి ఇకముందు నా అండ నీకుండదు. అది మాత్రం గుర్తుంచుకో...."

ఇలా నా ఆదర్శోపాఖ్యానం మొదటి అధ్యాయం ముగిసింది.

"చూడు అల్లుడూ! పెళ్ళి అయిపోయింది. ఇప్పుడు కన్య నా కూతురు కాదు. నీ భార్య" అన్న మా మామగారి మాటల్లోని అసలు విషయం అప్పుడు నాకు అర్థం కాలేదు.

"నీ అంతట నువ్వు వచ్చి కోరితేనే నా పిల్లని నీ కిచ్చాను. ఇక నా బాధ్యతేమీలేదు. మళ్ళీ మాట్లాడితే ఆమెనే అభిమానించే నా బాధ్యత కూడా నీదే!" అన్న అర్థం ఆ మాటలదని తర్వాత అర్థమైంది.

కోరే రావడంతో మామగారికి అలుసయ్యాననే విషయం చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. అప్పుడు తెలుసుకునీ లాభంలేదు.

"నాకు ఇంకా ఆడపిల్లలున్నారు. కాబట్టి ఇంతవరకూ నీకు చేసిందే గొప్ప...." కన్యాని నా చేతిలో పెట్టి నా కాళ్ళు కడగడానికి బదులు తన చేతులు కడిగేసుకున్నాడు ఆ పెద్దమనిషి. ఏదో మాట్లాడబోతే 'పెళ్ళి కాగానే ఎలాంటివాడివి ఎలా మారిపోయావు?!' నిష్ఠురాలాడి తప్పించు కున్నాడాయన.

ఇంట్లో వాళ్ళకి ఈ విషయాలు తెలిస్తే మరింత చులకనైపోనూ? నువ్వేగా ఏరికోరి ఆ సంబంధాన్ని చేసుకున్నది? అని నిలదియ్యరూ?

అందుకే అంతా దిగమింగుకోవడం తప్పనిసరైంది.

ఎటూ సపోర్ట్ లేకపోవడంతో ఇబ్బందులు మొదలయ్యాయి.

పురుళ్ళు.... పేరంటాలు....!

ఇదివరకటిలా డబ్బు చేతిలో ఆడడం లేదు. దాంతో స్నేహితులకు, బంధువులకు నాలో మార్పు కనిపించసాగింది.

మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి దిగజారడంతో అడపాదడపా ఎవర్నో ఒకర్ని డబ్బుకోసం ఆశ్రయించాల్సిన పరిస్థితులూ ప్రారంభమయ్యాయి.

అంతే! వాళ్ళందరూ మరింత దూరమవసాగారు.

"ఎలాంటివాడు ఎలా మారిపోయాడు?!" ముక్కున వేలేసుకున్నారు.

*  *  *

ఆదర్శాల వలయచక్రంలో రోజులు భారంగా దొర్లుతున్నాయి. రోజు రోజుకీ ఒంటరితనం పెరిగిపోతోంది.

నాగురించే ఆలోచిస్తున్నాగానీ తన గురించి ఆలోచించడంలేదనే విషయం అఖండ రూపంలో నాముందు దొర్లించింది హఠాత్తుగా మా ఆవిడ.

తెలుగు సినిమాలు తెగచూడడం, కలలు కనడం ఆమె హాబీ అని పెళ్ళయిన తర్వాతే తెలుసుకున్నాను.

నా కళ్ళు బైర్లు కమ్మేయి.

తన గురించి ఆలోచించడం లేదా? అసలు నేనీ పరిస్థితులన్నీ ఎవరికోసం ఎదుర్కొంటున్నట్లు?

పరిస్థితినంతా ఆమెకు వివరించాలనుకున్నాను.

''పెళ్ళికి ముందేపీటన్నింటి గురించీ ఆలోచించాల్సింది. మీ అంతటికి మీరే నా వెంటపడ్డారు. తీరా ఇప్పుడు....'' ఆమె గొంతు బొంగురు పోయింది.

"ఎలాంటి వారు ఎలా మారిపోయారూ!?" తనే అనేసింది.

నెత్తిన కర్రతో మోదినట్లయింది.

కళ్ళు గిర్రున తిరిగాయి. అయినా తమాయించుకున్నాను.

నేను ఏ మాత్రం మారలేదు. ఆ విషయం నాకు తెల్సు.. నా ఆదర్శాలని నేను విడిచిపెట్టదలచుకోలేదు. పెట్టను కూడా!

అందుకే ఇప్పుడు నేను చాలామంది దృష్టిలో అసమర్థుడిని!

ఇంకొంతమంది దృష్టిలో బ్రతకడం చేతకానివాడిని!!

అవునుమరి, ఇప్పుడు నేనుంటున్నది కాలేజీ గోడలమధ్యకాదు- విశాల ప్రపంచంలో!!! *

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక 18-10-84)